# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

పత్రికా ప్రకటన-1 31, అక్టోబరు, 2014

రహదారులు ఆర్థిక ప్రగతికి సూచిక కాబట్టి, ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలకు సాధనం కాబట్టి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా గుర్తిస్తున్నదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ప్రకటించారు. మానిఫెస్టోలో ఇచ్చిన హామి మేరకు జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్‌కు నాలుగు లైన్ల రహదారులు, మండల కేంద్రాల నుండి జిల్లా కేంద్రాలకు రెండు లైన్ల రహదారుల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. తెలంగాణలోని అన్ని రహదారులకు వెంటనే మరమ్మత్తులు చేయాలని సూచించారు. శుక్రవారం సచివాలయంలో రహదారుల పరిస్థితిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. నీటి పారుదల శాఖ మంత్రి టి.హరీష్ రావు, నేషనల్ హైవేస్ సిఇ గణపతి రెడ్డి, ఆర్ అండ్ బి ఇఎన్‌సి పి.రవీందర్ రావు, క్వాలిటీ కంట్రోల్ ఇఎన్‌సి బిక్షపతి తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం వరంగల్, కరీంనగర్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లా కేంద్రాలనుండి హైదరాబాద్‌కు నాలుగు లైన్ల రోడ్డు ఉందని, కొద్దిపాటి పనులు చేయాల్సి వున్నా అవి పురోగతిలో ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. నిజామాబాద్, ఖమ్మం రహదారులను నిర్మించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో 149 మండలాలకు జిల్లా కేంద్రాలకు మధ్య డబుల్ లైన్ లేదని, ఆ మండలాలకు వెంటనే డబుల్ రోడ్లు వేయాలని ఆదేశించారు. మండల కేంద్రాలకు మెరుగైన రహదారి సౌకర్యం లేని మహబూబ్‌నగర్, ఆదిలాబాద్ లాంటి జిల్లాలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. రాబోయే రెండేళ్లలో రెండు వేల కోట్ల రూపాయలతో 10 వేల కిలోమీటర్ల రహదారులను మరమ్మత్తు చేయాలని ఆదేశించారు. జనాభాలో సగ భాగం టూ వీలర్లు, ఆటోలు, ఫోర్ వీలర్లు, బస్‌ల ద్వారా రోజు ప్రయాణం చేస్తున్నారు కాబట్టి సగం రాష్ట్రం రోడ్ల మీదనే ఉన్నట్లు భావించాలన్నారు. అందుకోసం రహదారులను అద్దంలా తీర్చిదిద్దాలన్నది లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తెలంగాణ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను, రూరల్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పోరేషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణలో ఆర్ అండ్ బి శాఖను బలోపేతం చేస్తామన్నారు. ఆ శాఖలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేస్తామన్నారు. అత్యవసర సమయాల్లో రోడ్డు పనులు చేయడానికి సిఇకి రూ. 5 లక్షలు, ఎస్ఇకి రూ. 2 లక్షలు, ఇఇకి రూ. లక్ష వరకు అధికారం ఇస్తామన్నారు. రాబోయే రెండేళ్లలోనే రహదారుల కోసం

దాదాపు 12 వేల కోట్లు ఖర్చు పెట్టాలని నిర్ణయించుకున్నామని, కొన్ని జాతీయ రహదారులకు పెట్టే ఖర్చులు పోను ప్రతి నియోజకవర్గంలో సగటున రూ. 110 కోట్ల పనులు చేస్తామన్నారు.

రాజీవ్ రహదారి మార్గంలో అవసరమున్న చోట మరమ్మత్తులు చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఎస్ఆర్ఎస్పి ఎగువన ఒకటి, ఎస్ఆర్ఎస్పి దిగువన ఇంకోటి గోదావరి నదిపై వంతెనలు నిర్మించాలని అవి ముధోల్ – ఆర్మూర్ నియోజకవర్గాల మధ్యన, కడెం – రాయికల్ నియోజకవర్గాల మధ్యన ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలోని నదులు, ఉపనదులపై ఎక్కడ వంతెనలు కట్టాలనే విషయంపై సమీక్ష నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

రహదారుల అభివృద్ధి, నిర్మాణం, మరమ్మత్తుల పనుల్లో విపరీతమైన జాప్యం జరుగుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. దీన్ని నివారించడానికి టెండరు విధానంలో కూడా మార్పులు రావాలని చెప్పారు. సాధారణ, చిన్న పనులకు సంబంధించిన టెండర్లకు గడువును ఏడు రోజులు, పెద్ద పనులకు 15 రోజులు పెడతామన్నారు. 16వ రోజు వర్క్ అగ్రిమెంట్ చేసుకోవాలని సూచించారు.

అన్ని జిల్లా కేంద్రాల్లో రింగురోడ్లు నిర్మించడానికి కావలసిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.

సరైన ప్రణాళిక లేకుండా వంకర టింకరగా అనేక మలుపులతో నిర్మించిన రాజీవ్ రహదారిని సరి చేయాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. అవసరమైన చోట బైపాస్ రోడ్లు,ఫ్లై ఓవర్లు, అండర్ బ్రిడ్జిలు నిర్మించాలని సూచించారు. రాజీవ్ రహదారిని సరి చేయడానికి రూ. 750 కోట్లను ఖర్చు చేయనున్నట్లు కూడా వెల్లడించారు.

206 కిలోమీటర్ల పొడవున్న రాజీవ్ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిందని, అనుకున్నంత వేగంగా వాహనాలు పోవడం లేదని, గ్రామాల మధ్య నుండే రహదారి వెళ్లడం వల్ల అటు వాహనాలకు ఇటు గ్రామస్థులకు ఇబ్బంది అవుతోందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రజ్ఞాపూర్, కుక్కనూర్‌పల్లి, గౌరారం, వంటి మామిడిపల్లి, తుర్కపల్లి, దుద్దెడ, ములుగు, కొడకండ్ల, రామునిపట్ల, ఇబ్రహింనగర్ తదితర చోట్ల బైపాస్ రోడ్లు నిర్మించాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. షామీర్‌పేట, సిద్దిపేట, ఎల్కతుర్తి వద్ద ఫ్లైఓవర్లు నిర్మించాలని ముఖ్యమంత్రి చెప్పారు. 68 చోట్ల బస్ బే, బస్ షెల్టర్లు నిర్మించాలని నిర్ణయించారు. సిద్దిపేట, సుల్తానాబాద్ – పెద్దపల్లి మధ్య రెండు చోట్ల రోడ్ సైడ్ ఎమినిటీస్ ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు.

ఈ రెండు చోట్ల దాదాపు 15 ఎకరాల విస్తీర్ణంలో కఫెటేరియా, పార్క్ ఏరియా, పెట్రోల్ బంక్, టాయిలెట్లు, కార్ పార్కింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించారు. రాజీవ్ రహదారిని ఆదిలాబాద్ జిల్లా చాందారా వరకు పొడిగించాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ పనులకు సంబంధించి వెంటనే అంచనాలు తయారు చేసి టెండర్లు పిలవాలని ఆదేశించారు.

హైదరాబాద్ – వరంగల్ రహదారి ప్రస్తుతం యాదగిరిగుట్ట వరకు నాలుగు లైన్ల రోడ్డుగా వుందని, దానిని వరంగల్ వరకు నాలుగు లైన్ల రోడ్డు నిర్మించే పనులు తొందరగా పూర్తి చేయాలని చెప్పారు. వరంగల్, జనగామ, ఆలేరులో బైపాస్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా ముఖ్యమంత్రి పరిశీలించారు. వరంగల్ జిల్లా తాడ్వాయి మండలంలో అటవీ శాఖ అనుమతి లేక పోవడం వల్ల ఆగిపోయిన జాతీయ రహదారి పనులకు ఇటీవలే అనుమతి వచ్చినందున తొందరగా ఆ రోడ్డును నిర్మించాలని ముఖ్యమంత్రి సూచించారు. రాష్ట్రంలో రహదారులన్నింటిని పూర్తి స్థాయిలో బాగు చేసే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఉన్నదని, త్వరలోనే కేబినెట్ సబ్ కమిటి సమావేశమై మరికొన్ని సిఫారసులు చేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. ఆ వెంటనే అధికారులు రంగంలోకి దిగి అంచనాలు రూపొందించాలని, టెండర్లు కూడా వెంటనే పిలిచి పనులు వేగంగా చేయాలని సూచించారు. నిధులకు కొరత రాకుండా త్వరలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో కొంత, వచ్చే ఏడాది మార్చిలో ప్రవేశపెట్టే బడ్జెట్‌లో మరికొంత నిధులను ఇస్తామని వెల్లడించారు. రాష్ట్రంలోని మూడు స్టేట్ హైవేలు నేషనల్ హైవేలుగా అప్‌గ్రేడ్ అయినందున ఆ పనులు కూడా త్వరగా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి రావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. జగిత్యాల – కరీంనగర్ – వరంగల్, కురవి – ఖమ్మం – కోదాడ, నిజాంపేట్ – నారాయణఖేడ్ – బీదర్ రహదారులు ఇటీవలే జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ అయ్యాయి.

---

సిపిఆర్ఓ టు సిఎం